క్లుప్తంగా

బీజేపీకి దివ్వెల రాజీనామా


దివ్వెల శ్రీనివాసరావు

సత్తెనపల్లి: బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, అనుబంధ సంఘాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పల్నాడు జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అలోకం సుధాకర్ బాబుకు మంగళవారం పంపించారు. పార్టీలో జరుగుతున్న అంతర్గత పరిణామాలు, వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు వివరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ



సత్తెనపల్లి: ఆంధ్ర యూనివర్సిటీలో ఈనెల 22 నుంచి 24 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక బాబా గురుదేవ్ డిగ్రీ, పీజీ కళాశాల బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 93 కేజీల వ్యక్తిగత విభాగంలో పసుపులేటి అశోక్ గోల్డ్ మెడల్, 59 కేజీల వ్యక్తిగత విభాగంలో కోడూరి సౌరబ్ చక్రవర్తి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మంగళవారం ప్రతిభ చూపిన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ మట్టా సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రిన్సిపల్ డి.మాధవి, అధ్యాపకులు అభినందించారు.

వైభవంగా విజయ శంకర యాత్ర

సత్తెనపల్లి: పట్టణంలో వేదగాయత్రీ పురోహిత సంఘ ఆధ్వర్యంలో విజయ శంకర యాత్ర మంగళవారం వైభవంగా జరిగింది. పట్టణంలోని శివాలయం వద్ద నుంచి యాత్రగా బయలుదేరి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయానికి భక్తులు చేరుకున్నారు. ఆదిశంకరాచార్య స్వామికి, సచ్చిదానంద భారతి స్వామికి, ఈశ్వరునికి అభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా వేద గాయత్రి పురోహిత సంఘ అధ్యక్షులు కలవకొలను సీతారామ శాస్త్రి, కార్యదర్శి మద్దాలి అనిల్ కుమార్, కోశాధికారి మైలవరపు సుబ్బారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖులు, బ్రాహ్మణ సంఘ నాయకులు, వేద గాయత్రి సంఘ నాయకులు సభ్యులు, ఐక్యవేదిక సభ్యులు పాల్గొన్నారు.

27న గాంధీ విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి: సత్యం, అహింసే ఆయుధంగా దేశానికి స్వాతంత్య్రం తీసుకు వచ్చిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహావిష్కరణ ఈ నెల 27న పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్క చంద్రపాల్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు చేతుల మీదుగా విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర మాజీ మంత్రి జెడి శీలం తదితరులు హాజరవుతారని వివరించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజ్ పాల్, ముప్పాళ్ళ మండల ప్రెసిడెంట్ కోట ఆనంద్, జెట్టి శేఖర్, మంగళపురి శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి

చిలకలూరిపేట: సమాజంలో ఆధ్యాత్మిక భావనల వ్యాప్తికి ఆది శంకరాచార్యులు బాటలు వేశారని ఆదిత్యా బ్రాహ్మణసేవాసమితి గౌరవ అధ్యక్షుడు చల్లా విజయకుమార్ చెప్పారు. ఆది శంకరాచార్యుల జయంతిని సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు ఉత్తమ మార్గంలో పయనించేందుకు ఆదిశంకరాచార్యుల బోధనలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. మానవజన్మ గొప్పతనాన్ని చాటారని వివరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఏకమారుతీరామ శర్మ, కార్యదర్శి పోలూరి రామచంద్రమౌళి, పి.శేషగిరి, కె.లక్ష్మీనారాయణ, జె నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

యడ్లపాడు: భవనంపై నుంచి పడి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం .. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా గోబిందపూర్ గ్రామానికి చెందిన పవిత్రస్వైన్ కుటుంబం ఉపాధి పనుల నిమిత్తం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని కల్పతరువు నూలుమిల్లులో ఐదేళ్ల కిందట చేరారు. నాటి నుంచి మిల్లు ఆవరణలోని క్వార్టర్లలో నివాసం ఉంటూ జీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పవిత్రస్వైన్ (42) మద్యం సేవించి రెండస్తుల భవనంపై ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన అతన్ని గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య కస్తూరిస్వైన్ ఫిర్యాదుతో యడ్లపాడు ఎస్‌ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

దోమలేరియా లేకుండా చేద్దాం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం
- సత్తెనపల్లి ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రావు
- ప్రపంచ మలేరియా దినం సందర్భంగా ర్యాలీలు


సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్ మధుసూదన్‌రావు

సత్తెనపల్లి/నకరికల్లు/రాజుపాలెం/ముప్పాళ్ల/అచ్చంపేట/పెదకూరపాడు: పట్టణంలో దోమలేరియా లేకుండా చేద్దామని సత్తెనపల్లి ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రావు చెప్పారు. ప్రపంచ మలేరియా దినం సందర్భంగా పట్టణంలో పట్టణ మలేరియా సబ్ యూనిట్, పురపాలక సంఘం, పట్టణ ఆరోగ్య కేంద్రాల సిబ్బందితో మంగళవారం ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రావు మాట్లాడుతూ దోమల నియంత్రణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలని, ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచం నుంచి మలేరియా వ్యాధిని 2030 నాటికి పూర్తిగా నిర్మూలించే లక్ష్యంగా పని చేయాలన్నారు. వడవల్లి పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ షేక్ మహబూబ్ మాట్లాడుతూ మలేరియా వ్యాధి వ్యాప్తికి ప్రధాన కారకమైన దోమల గురించి వివరించారు. నివారణ చర్యలను సూచించారు. కార్యక్రమంలో వెంగళరెడ్డినగర్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ షేక్ సిరాజున్నీసా, మార్కెట్ యార్డ్ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ధర్మ, పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి సి.హెచ్.ప్రభాకర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి, మెప్మా టీఎంసీ నాగేశ్వరి, ఆరోగ్య సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు, శానిటరీ సెక్రటరీలు, ఆర్‌పీలు, టీబీ, లెప్రసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- నకరికల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిణి బి.నాగమణి ఆధ్వర్యంలో మంగళవారం నకరికల్లులో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు దోమల వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కె.మల్లయ్య, ప్రధానోపాధ్యాయుడు మేదరమెట్ల స్వామి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.
- రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ వెంకటకృష్ణకుమార్ ఆధ్వర్యంలో అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు జీవనరావు, ఉదయలక్ష్మి, ఏఎన్‌ఎమ్ కోటేశ్వరరావు, రమాదేవి, ఆరోగ్య సిబ్బంది రాజ్యలక్ష్మీ, లక్ష్మీతిరుపతమ్మ పాల్గొన్నారు.
- ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యురాలు పి.రమాదేవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌ఓ ఆంజనేయులు, సూపర్‌వైజర్లు పీటర్‌దేమీయన్, నాగమల్లేశ్వరరావు, జోస్పిన్‌రాణి, భవానికుమారి, సిబ్బంది పాల్గొన్నారు.
- అచ్చంపేట మండల వైద్యాధికారి డాక్టర్ శ్యామల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ పార్వతి పాల్గొన్నారు.
- పెదకూరపాడు వైద్యాధికారి డాక్టర్ వెలుగొండ రెడ్డి ఆధ్వర్యంలో 75త్యాళ్లూరులో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, డాక్టర్ విజయకుమార్, సూపర్‌వైజర్ దిలీప్, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, బేగం తదితరులు పాల్గొన్నారు.


అచ్చంపేటలో..


75త్యాళ్లూరులో..


నకరికల్లులో ర్యాలీ


రాజుపాలెం గ్రామంలో..


ముప్పాళ్లలో..

పది క్వింటాళ్ల మిరప కాయలు దహనం


దగ్ధమైన మిరపకాయల వద్ద రైతు, అతని భార్య, గ్రామస్తులు

రాజుపాలెం: రైతు కల్లంలో ఆరబోసిన మిరపకాయలను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టిన ఘటన మండలంలోని రెడ్డిగూడెంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన రైతు గౌతుకట్ల వెంకట్రావు మిరప కాయలను కల్లంలో ఆరబోశాడు. సుమారు 10 క్వింటాళ్లు ఉంటాయని, రెండు రోజుల క్రితం వేరే వ్యాపారికి క్వింటా రూ.18వేల చొప్పున అమ్మేందుకు కొంత అడ్వాన్సు తీసుకున్నాడు. మంగళవారం తెల్లవారు జామున గోతాలకు తొక్కి కాటా వేయాలి. రైతు వెంకట్రావు కూలీలను తీసుకుని కల్లం వద్దకు వెళ్లే సరికే పది క్వింటాళ్ల మిరపకాయలు దగ్ధమై ఉన్నాయి. అది చూసిన రైతు, అతని భార్య గురవమ్మ కన్నీటి పర్యంతమయ్యారు. పంట విలువ సుమారు రెండు లక్షల రూపాయల వరకు ఉంటుంది. వెంకట్రావు పోలీసులకు సమాచారం అందించడంతో అదే గ్రామానికి చెందిన అనుమానితుడు నిమ్మకాయల షేక్ రామ్ తుల్లాను ఎస్‌ఐ ఎం.నారాయణ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

మంచినీరు, మజ్జిగ పంపిణీ అభినందనీయం


మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించటమే కాక, వేసవి కాలంలో మంచినీటితోపాటు మజ్జిగను పంపిణీ చేయడం అభినందనీయమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు కొనియాడారు. ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్‌లో వాసవి గంగా పేరుతో ఏర్పాటు చేసిన మజ్జిగ, మంచినీటి చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాంబశివరావు మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు శింగరి మధుసూదన్ రావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మీశివన్నారాయణ, ఆవోప పట్టణ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ సహకారం అభినందనీయం

- అభినందించిన కలెక్టర్
- సమావేశపు మందిర నిర్మాణానికి ఐఎంఏ సభ్యుల హామీ


జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వెంకటేశ్వరరావు

నరసరావుపేట: జిల్లా అభివృద్ధికి భారతీయ వైద్య మండలి (ఐఎంఏ) సహకారం అందించడంపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అభినందించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఐఎంఏ నరసరావుపేట కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, డాక్టర్ మధుసూదన్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా అభివృద్ధికి ఐఎంఏ సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్ చేస్తున్న కృషిని కొనియాడారు. కలెక్టరేట్ పరిసరాలలో సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఐఎంఏ సహకారంతో సుమారు 250 మందితో సమావేశం నిర్వహించుకునేందుకు వీలుగా అన్నీ వసతులతో భవన నిర్మాణం స్వచ్ఛందంగా పూర్తిచేసి అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్‌కు తెలియజేశారు. దీనికి వారిని కలెక్టర్ అభినందించారు. అచ్చంపేట, పిడుగురాళ్ళ, చిలకలూరిపేట, వినుకొండ తదితర మండలాలకు చెందిన ఐఎంఏ సభ్యులను సమన్వయ పరచుకుని పల్నాడు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. వారివెంట వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి డాక్టర్ జి. శోభారాణి పాల్గొన్నారు.

అక్రమ సారా కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ నాటుసారా, మద్యం కేసుల్లో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్ర బాబు మంగళవారం తెలిపారు. పమిడిపాడు గ్రా మంలో రెండు నెలల క్రితం బండ్ల హరికృష్ణ అక్రమ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ సమయంలో నిందితుడు పరారయ్యాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతని కోసం గాలిస్తుండగా పమిడిపాడు శివారు పట్టుబడ్డారన్నారు. అదే విధంగా గతంలో పట్టుబడ్డ తెలంగాణ అక్రమ మద్యం కేసులో కూడా హరికృష్ణ నిందితుడిగా ఉన్నాడన్నారు. రెండు కేసుల్లో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాగపవన్‌కుమార్‌కు విశ్వజననీ సేవారత్న అవార్డు

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి గజవల్లి నాగపవన్‌కుమార్‌కు విశ్వజననీ సేవా రత్న అవార్డు లభించింది. నరసరావుపేటలో జరిగిన విశ్వజననీ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవ సభలో పవన్‌కుమార్ ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా ఈ సేవా రత్న పురస్కారం అందుకున్నారు.

నేడు కోనూరులో గడప గడపకు మన ప్రభుత్వం

అచ్చంపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలోని కోనూరులో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి వెంకటేశ్వరరావు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరై ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ముప్పాళ్ళ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారని పేర్కొన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు, ఆయా శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని పేర్కొన్నారు.

తొండపిలో ఫ్యామిలీ ఫిజీషియన్

తొండపి(ముప్పాళ్ళ): మండలంలోని తొండపి గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో వైద్యులు జయ కృష్ణప్రవీణ పాల్గొని 84 మందికి వైద్యసేవలందించారు. పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్ళి అవసరమైన వైద్య సేవలందించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుగుణ, సూపర్‌వైజర్ భవానికుమారి, ఏఎన్‌ఎమ్ పద్మ, డీఈఓ రవితేజ, ఆశ, అంగన్‌వాడీకార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవం

నరసరావుపేట ఈస్ట్: పాతూరులో వేంచేసియున్న శ్రీచౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవం మంగళవారం తెల్లవారు జా మున వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్థరాత్రి ఒంటిగంట సమయంలో అమ్మవారికి త్రినేత్రాలంకారణ నిర్వహించి హోమగుండం ప్రజ్వలింప చేశారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన జ్యోతులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చి పట్టణ వీధులలో ఊరేగింపు నిర్వహించారు.

సేవాతత్పరత కలిగి ఉండాలి


పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

రేపల్లె: విద్యార్థి దశ నుంచే సేవాతత్పరతను కలిగి ఉండాలని ఐఆర్‌ఈఎఫ్ విద్యాసంస్థల డిప్యూటీ డైరెక్టర్ జాన్ రెబ్బా పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా ఆర్‌సీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మంగళవారం గాస్పల్ ఫీల్డ్స్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రతపై మాట్లాడారు. ఐఆర్‌ఈఎఫ్ పరిపాలనాధికారి జోషా రెబ్బా, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్‌లు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు


మాట్లాడుతున్న పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు

పెదకూరపాడు: పోరాటాలతోనే హక్కులు సాధించుకోగలమని పద్మశాలి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జగ్గారపు శ్రీనివాసరావు చెప్పారు. పద్మశాలీల కుల దైవమైన భావనారుషి స్వామి జయంత్యుత్సవం మండలంలోని గారపాడులో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పద్మశాలీల ఆత్మీయ సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో 11 శాతం జనాభా ఉన్న పద్మశాలీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారన్నారు. రాజ్యాధికారం కోసం పోరాడే సమయం ఆసన్నమైందన్నారు. ఐకమత్యంగా ఉంటేనే రాజకీయ పార్టీలు మనల్ని గుర్తిస్తాయని చెప్పారు. పద్మశాలీ సంఘ మండల, గ్రామ కమిటీలను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభ ఉన్న పద్మశాలి విద్యార్థులకు ఆర్థిక చేయూతనందిస్తామన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మునగపాటి వెంకటేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు వంగర సోమసుందరరావు, వెంకటేశ్వరరావు, చిలుకోటి అంజిబాబు, హరివేణి వెంకట్రావు, గోలి వంశీకృష్ణ, రంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌరాణిక, జానపద కళలను ఆదరించాలి

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల: పౌరాణిక, జానపద కళలను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో ఆల్‌ఇండియా కళారంగ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పౌరాణిక పద్య, ఏకపాత్రల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామానికి చెందిన హార్మోనిస్టు గురువు మండలపు కేశవులు వర్ధంతి సందర్భంగా పోటీలను నిర్వహించటం ఆనందదాయకమన్నారు. డీవీ సుబ్బారావు లాంటి కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను పాత్రలో పద్యాలు పాడేవారన్నారు. అలాంటి కళాకారుల నాటకాలు ఎంత దూరంలో ప్రదర్శిస్తున్నా వ్యయప్రయాసలకోర్చి చూసేవారన్నారు.

ఈ పోటీలలో పాల్గొని విజేత లైన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవితేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్, చీమల శ్రీనివాస రెడ్డి, గజ్జల ముసలారెడ్డి, పడాల హనిమిరెడ్డి, కళారంగ సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ అధ్యక్షుడిపై దాడి

చిలకలూరిపేటటౌన్: సొసైటీ అధ్యక్షుడిపై దాడి జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసు కుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మురికిపూడి సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఆరుమళ్ల వెంకట శివ ఇటీవల నియమితుడయ్యాడు. అదే గ్రామానికి చెందిన మందుల హరికృష్ణ మధ్యాహ్నం సమయంలో వెంకటశివకు పలుమార్లు ఫోన్ చేయగా ఐదోసారి ఫోన్ ఎత్తాడు. నేను ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎందుకు ఎత్తడం లేదని వెంకటశివపై హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో హరికృష్ణ కోపంగా వెంకటశివ కార్యాలయానికి వెళ్లి గొడవపడి దాడి చేశాడు. దీంతో ఇదే విషయాన్ని వెంకటశివ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పలువురు స్టేషన్‌కు చేరుకొని మాట్లాడుకుందాం రా అని వెంకటశివకు కబురు పెట్టారు. సాయంత్రం స్టేషన్‌కు చేరుకోగా స్టేషన్ ముందే ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్టేషన్‌కు మాట్లాడుకుందాం రా అని పిలిపించి తనపై గ్రామానికి చెందిన సీవీ రామన్, మందుల లక్ష్మీనారాయణ, రావు వారి గోపి, రమేష్, సాంబయ్య తదితరులు దాడి చేశారని వెంకటశివ ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారిస్తున్నారు.

పెరటి కోళ్లతో లాభాలు బాగు..

- పొదుపు మహిళలకు పంపిణీ
- ఆర్థికాభివృద్ధికి ఉపయుక్తం


జంపని గ్రామంలో పెరటి కోళ్ల పంపిణీ చేస్తున్న అధికారులు

వేమూరు: గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి ప్రభుత్వం జాతి కోళ్ల పంపిణీ చేపట్టింది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందడం పొందేందుకు పెరటి కోళ్ల పెంపకం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా డ్వాక్రా గ్రూపుల మహిళలకు వేమూరు నియోజకవర్గంలో 300 యూనిట్లు అందజేశారు. ఇందులో వేమూరు, కొల్లూరు, అమర్తలూరు మండలాలకు వంద లెక్కన యూనిట్లు వచ్చాయి. వేమూరు మండలంలో మూడు క్లస్టర్లు ఉన్నాయి. వేమూరు క్లస్టర్‌కు 33, జంపని క్లస్టర్‌కు 33, పెరవలి క్లస్టర్‌కు 34 యూనిట్లు పంపిణీ చేశారు. యూనిట్‌కు 12 కోళ్లు ఉంటాయి. వాటిలో 3 పుంజులు, 9 కోళ్లు. లబ్ధిదారులు యూనిట్‌కు రూ.4,800 చెల్లిస్తే.. కోళ్లతో పాటు 30కిలోల ధాన్యం, మెడికల్ కిట్ ప్రభుత్వం అదజేస్తోంది.

కోళ్ల పెంపకం వల్ల ఉపయోగాలు

ఒక జాతి కోడి సుమారు 60 గుడ్లు పెడుతుంది. ఒక కోడి సుమారు మూడు కిలోల బరువు పెరుగుతుంది. మార్కెట్‌లో జాతి కోడి మాంసం కిలో రూ.300కు విక్రయిస్తున్నారు. ఈ కోడి గుడ్లులో పౌష్టికాహారం అధికంగా ఉంటుంది. అందు వల్ల వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. గతేడాది నియోజకవర్గంలో భట్టిప్రోలు, చుండూరు మండలాల్లో యూనిట్లు పంపిణీ చేశారు. డ్వాక్రా గ్రూపు మహిళలు ఎక్కువ లాభాలు చూడటంతో..ఈ ఏడాది నియోజక వర్గంలోని మూడు మండలాల్లో యూనిట్లు అందించడం జరిగిందని అధికారులు తెలిపారు.

కోళ్లు పెంపకం వల్ల అధిక రాబడి

డ్వాక్రా గ్రూపుల మహిళలు నాటు కోళ్ల పెంపకం వల్ల ఆదాయం పొందుతున్నారు. వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం అనేక పథకాలు తీసుకొస్తోంది.

– శోభన్ బాబు, ఏపీఎం, వేమూరు.

క్రీడాకారులకు అండగా ప్రభుత్వం


ఆట్ల శివనాగిరెడ్డిని సన్మానిస్తున్న కె.పాల్‌కుమార్

బాపట్ల: క్రీడాకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం సాయం చేస్తోందని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి కె.పాల్‌కుమార్ పేర్కొన్నారు. మార్చి 20 నుంచి 23 వరకు అస్సాంలోని తమల్‌పురలో జరిగిన 4వ ఏషియన్ ఖోఖో అంతర్జాతీయ పోటీల్లో భారతదేశం తరపున బంగారు పతకం సాధించిన ఆట్ల శివనాగిరెడ్డిని మంగళవారం ఆయన సన్మానించారు. స్థానిక క్రీడా ప్రాంగణంలో సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కె.పాల్‌కుమార్ మాట్లాడుతూ బాపట్ల జిల్లా జె.పంగులూరు గ్రామంలోని ఎస్‌ఆర్‌ఆర్ ఖోఖో అకాడమీ కోచ్ మేకల సీతారామిరెడ్డి శిక్షణలో శివనాగిరెడ్డి పతకం సాధించటం ఎంతో సంతోషమన్నారు. శివనాగిరెడ్డికి ప్రభుత్వపరంగా సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ కోచ్ పి.శైలజ, అథ్లెట్ కోచ్ ఉదయభాస్కర్, కె.శశింద్రి తదితరులు ఉన్నారు.